# ఇంటింటికీ వెళ్లి వ్యాధులపై ఆరా

- సాక్షి కథనంపై స్పందించిన పంచాయతీరాజ్ అధికారులు
- వైద్యులతో సమావేశం నిర్వహించిన ఈవోఆర్డీ
- పారిశుద్ధ్య పనులు ముమ్మరం

సాక్షి స్పందన

**భీమడోలు:** హడలెత్తిస్తున్న అతిసారం శీర్షికన సాక్షిలో ఈనెల 14న శనివారం ప్రచురితమైన కథనంపై పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించారు. భీమడోలు, పోలసానిపల్లి, పూళ్ల తదితర గ్రామాల్లో విరేచనాలతో ఆసుపత్రుల్లో చేరి డిశ్చార్జి అయిన రోగుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. మండల పంచాయతీరాజ్ విస్తరణాధికారి ఏ.సుందరి ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత ముమ్మరం చేశారు.



భీమడోలు ఆరోగ్య కేంద్రంలో సూపరింటెండెంట్ సునీతతో సమావేశమైన ఈవోఆర్డీ సుందరి



భీమడోలులో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలపై ఆరా తీస్తున్న ఈవోఆర్డీ సుందరి

స్టాప్ డయేరియాలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ తీరును ఆమె పరిశీలించారు. ప్రతి రోజు చేసే నీటి పరీక్షలు, రక్షిత నీటి సరఫరా తీరును ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పట్ల ప్రజల్లో మరింత చైతన్యం తీసుకుని రావాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్య సిబ్బందిపై ఉందని వారికి తగు సూచనలందించారు. గ్రామాల్లో డయేరియా కేసులు, సీజనల్ వ్యాధులు రాకుండా పంచాయతీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎప్పటికప్పుడు అప్రమత్తతతో ఉండాలని సూచించారు. అలసత్వాన్ని చూపితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. తొలుత భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయేరియా, సీజనల్ వ్యాధిగ్రస్తులు చికిత్స పొందుతున్నారా అని ఈవోఆర్డీ సుందరి ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీత నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సునీత, వైద్యులతో ఆమె సమావేశాన్ని నిర్వహించి ఆరోగ్య సంబంధ విషయాలపై చర్చించారు. ఆసుపత్రిలో డయేరియా బారిన పడి ఆసుపత్రిలో ఎవరూ చేరలేదని పేర్కొన్నారు. తీసుకున్న ఆహారం జీర్ణం కాక, వయస్సు సమస్యల వల్ల వారికి వాంతులు, విరేచనాలయ్యాయని తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో కోలుకుని వారు ఇళ్లకు వెళ్లారని పేర్కొన్నారు. వ్యాధులు ప్రబలకుండా ప్రజలు పరిశుభ్రతను పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు మడక హేమసుందర్, జయరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీహెచ్ఏ కేవీ సత్యనారాయణ

**దెందులూరు :** పరిసరాలు పరిశుభ్రంగా ఉంటూ మురుగు నీరు నిల్వ లేకుండా దోమలు పెరగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని పెరుగ్గూడెం పంచాయతీ ఎంపీహెచ్ఏ కేవీ సత్యనారాయణ అన్నారు. సోమవారం దెందులూరు మండలం పెరుగ్గూడెం, తిమ్మన్నగూడెం మండల ప్రజా పరిషత్ పాఠశాలలో డెంగీ, డయేరియా తదతర వ్యాధుల వ్యాప్తి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ, అంగన్‌వాడీలతో కలిసి జల జీవన్ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ భరత్ చంద్, ఏఎన్ఎంలు మాధవి ఉన్నారు.

### ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



గణపవరం సంతమార్కెట్ వద్ద పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న సర్పంచ్, కార్యదర్శి

**గణపవరం:** స్థానిక పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పట్టణంలో పారిశుద్ధ్యం క్షీణించింది. ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోవడంతో దుర్గంధం వ్యాపించి, దోమలు విజృంభిస్తున్నాయి. దీనితో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సోమవారం గణపవరం సంతమార్కెట్, పీహెచ్‌సీ, కులంబీపేట ప్రాంతాల్లో నిల్వఉన్న మురుగు నీటిని తొలగించేందుకు కచ్చా డ్రెయిన్లు తవ్వారు. ఈ పనులను సర్పంచ్ మూర అలంకారం, పంచాయతీ కార్యదర్శి డీఎస్ఆర్ ప్రసాద్, పంచాయతీ సిబ్బంది పర్యవేక్షించారు. గ్రామంలోని మురుగు డ్రెయిన్లలో సిల్ట్ తొలగింపు పనులు సాగుతున్నాయి. డ్రెయిన్లు, రోడ్లు, ఖాళీ స్థలాల్లో దోమల నివారణకు మందు పిచికారీ చేసి, బ్లీచింగ్ చల్లుతున్నారు.

### ప్రాథమిక పాఠశాల తనిఖీ



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి

**పెదపాడు:** విద్యార్థులు తమ సామర్థ్యాలను పెంపొందించుకునేలా విద్యను అందించాలని పెదపాడు ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి తెలిపారు. పెదపాడు మండలంలోని గండి చెరువు గట్టు ప్రాథమిక పాఠశాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాలలో హాజరు శాతం పెంచేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఐవీ రావు తదితరులు పాల్గొన్నారు.

### తాగునీరు, డ్రెయిన్ల సమస్యలతో ఇక్కట్లు

**భీమడోలు:** తాగునీరు, డ్రెయిన్ల సమస్యతో గుండుగొలను ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి వాటిని పరిష్కరించాలని కోరుతూ భీమడోలు ఏఎంసీ మాజీ చైర్మన్ వగ్వాల భాస్కర్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. 20వేల జనాభా కలిగిన గుండుగొలనులో స్థానికంగా చెరువులున్నప్పటికీ ప్రజలకు అవసరమైన తాగునీటిని సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు పంపిణీ చేయలేకపోతున్నారని వాపోయారు. కొంత కాలంగా మరమ్మతులకు గురైన ఫిల్టర్ బెడ్లను బాగు చేయకుండా బోరు నీటినే ట్యాంకులకు లిఫ్ట్ చేసి వాటినే ప్రజలకు అందిస్తున్నారన్నారు. గుండుగొలనులోని నాంది వాటర్ ప్లాంట్‌ను పంచాయతీ వారు నిబంధనల మేరకు స్వాధీనం చేసుకోవాలని పేర్కొన్నారు. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని తెలిపారు. కొన్నేళ్లుగా గ్రామంలోని సంతమార్కెట్ వద్ద రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని వేడుకున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని భాస్కర్ అన్నారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలన ఆయన కోరారు.

### ముగిసిన వారాహి నవరాత్రి మహోత్సవాలు

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** స్థానిక సత్రంపాడు శ్రీ సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఈనెల 6వ తేదీన ప్రారంభమైన శ్రీ వారాహి నవరాత్రి మహోత్సవాలు సోమవారం ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం శ్రీచక్ర అభిషేకం చేసి అనంతరం సహస్ర నామార్చన చేశారు. అమ్మవారికి వారాహి మాతగా అలంకరించారు.

## చర్చి నిర్మాణానికి విరాళం అందజేత



చర్చి నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

**దెందులూరు:** దెందులూరులో సాల్వేషన్ ఆర్మీ చర్చి నిర్మాణానికి దివంగత మేజర్ పాలపర్తి యోహాను, విజయ సుశాంతిభాయ్ జ్ఞాపకార్థం వారి కుమారుడు పాలపర్తి విలియం చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు, రూ. 50 వేల నగదును సోమవారం అందజేశారు. దెందులూరు కోర్ ఆఫీసర్ మేజర్ కె.రమణయ్య, రిటైర్డ్ కల్నల్ జోషియా, కొంగర కిరణ్, సంఘ పెద్దలకు ఈ విరాళాన్ని అందజేశారు. చర్చి నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాలని వారంతా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు స్పందన కరవు

**పెదపాడు:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి దరఖాస్తులు రాలేదని తహసీల్దార్ భావన్నారాయణ తెలిపారు.

## కొత్త చట్టాలపై అవగాహన అవసరం

**గణపవరం:** బాల్యవివాహాలు చేయడం సామాజిక దురాచారమే కాక చట్టరీత్యా నేరమని, ఈ విషయాన్ని గ్రామాల్లో ప్రజలకు వివరించాలని గణపవరం ఐసీడీఎస్ సీడీపీవో టి.లక్ష్మీసరస్వతి అన్నారు. సోమవారం గణపవరం తహసీల్దార్ కార్యాలయంలో కొత్త చట్టాలపై బాల్య వివాహాల నిరోధక కమిటీ మండల స్థాయి అధికారులు, వీఆర్వోలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యత కారణంగా చట్టాలపై అవగాహన లేక బాల్య వివాహాలు చేస్తున్నారని అన్నారు. బాల్య వివాహాలు చేస్తే వరుడికి ఏడు సంవత్సరాల జైలుశిక్ష, తల్లిదండ్రులకు రెండేళ్ల జైలు, లక్ష రూపాయల జరిమానా విధిస్తారని వివరించారు. కొత్తగా మూడు న్యాయ చట్టాలు భారతీయ న్యాయ సాహిత్య- 2023 మైనర్ బాలికలపై అత్యాచార చట్టం, ఉద్యోగినులపై వేధింపుల చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం అమలులో ఉన్నాయని తెలిపారు. వీటిపై ప్రజలకు వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వై.రాంబాబు, ఎంపీడీవో సూర్యనారాయణ, ఎంఈవో పుచ్చల శేషు, ఏవో యర్రంశెట్టి ప్రసాద్, డీటీ పోతురాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తులసి, దుర్గాభవాని, చంద్రావతి పాల్గొన్నారు.



గణపవరంలో కొత్త చట్టాలను వివరిస్తున్న సీడీపీవో సరస్వతి

## 2వేల ఎకరాల్లో వరి నాట్లు పూర్తి

**గణపవరం:** గణపవరం మండలంలో ఖరీఫ్ వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో మొత్తం 12 వేల ఎకరాల్లో సార్వా సాగు చేస్తుండగా, ఇప్పటి వరకూ రెండు వేల ఎకరాల్లో వరినాట్లు పూర్తయినట్లు మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్ తెలిపారు. వారం రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో రైతులు సార్వా నాట్లు పనులు ముమ్మరంగా చేపట్టారు. గణపవరం, సరిపల్లె, కొత్తపల్లి, వరదరాజపురం, కేశవరం, కొందేపాడు, మొయ్యేరు, ముప్పర్తిపాడు, పిప్పర, వెంకట్రాజపురం, కోమర్రు తదితర గ్రామాల్లో పొలాల్లో దమ్ములు జోరుగా సాగుతున్నాయి. కొత్తపల్లిలో సుమారు 50 ఎకరాలకు నారుమడులు వేయలేదని, ఇతర ప్రాంతాల నుంచి నారు కొనుక్కుని నాట్లు వేయనున్నట్లు రైతులు తెలిపారు. కాశిపాడు, చిలకంపాడు, వాకపల్లి, పిప్పర ఆయకట్టులో వరినాట్లు పూర్తయ్యాయి. రైతులు ఎక్కువగా సంపద, సంపద గోల్డ్, ఎంటీయూ 7029, పీఎల్ 1100, పీఆర్ 126, ఎంటీయూ 1318 రకాలను సార్వాలో సాగు చేస్తున్నారు.



గణపవరంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

## నాయకుల విగ్రహాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్

**దెందులూరు:** చల్లచింతలపూడిలో బస్టాండ్ సెంటరు వద్ద మహాత్మా గాంధీ, డాక్టర్ వైఎస్సార్, ఎన్టీఆర్ విగ్రహాల మధ్య ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని విద్యుత్ శాఖ ఏడీఈ ఎస్ త్రివాస్‌కు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. సోమవారం చల్లచింతలపూడిలో బస్టాండ్ సెంటరు వద్ద నాయకుల విగ్రహాల మధ్య విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు, ప్రయాణికులకు, విగ్రహాల వద్దకు వెళ్లిన వారికి ప్రమాదం పొంచి ఉందని గ్రామ మాజీ సర్పంచ్ ఎం.మోహనరావు, నాయకులు వేమన రాము తదితరులు వివరించారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా ప్రమాదంలేని చోటుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించాలని ఏడీఈ ఎస్.త్రివాస్‌కు ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ నాయకుల విగ్రహాల మధ్య నుంచి ట్రాన్స్‌ఫార్మర్లను తొలగిస్తామన్నారు.



చల్లచింతలపూడి మహాత్మాగాంధీ, డాక్టర్ వైఎస్సార్, ఎన్టీఆర్ విగ్రహాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

## మెట్ట ప్రాంతంలో విస్తారంగా అంతర పంటల సాగు

**దెందులూరు:** మెట్ట గ్రామాలైన పెరుగ్గూడెం, చల్లచింతలపూడి, మేదినరావుపాలెం, గంగన్నగూడెం, జోగన్నపాలెంలో వరికి ప్రత్యామ్నాయంగా అంతర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో బీర, ఆనప, నిమ్మ పంటలతో పాటు అనేక పంటలు ఈ ప్రాంతాల్లో రైతులు సాగు చేస్తున్నారు. అంతర పంటల సాగుతో ఖర్చు తక్కువతో అధిక దిగుబడి సాధిస్తున్నామని రైతు నాయకులు యలమర్తి రామకృష్ణ అన్నారు. పెరుగ్గూడెంలో ఆయిల్‌పామ్ తోటలో బెండ, కొబ్బరి, ఆనప, బీర కాయ పంటలు సాగు చేస్తున్నట్టు రైతులు తెలిపారు.

## ప్రజా సమస్యలపై వినతులు

**దెందులూరు :** సకాలంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మీ కోసం- మీ చింతమనేని కార్యక్రమం ప్రారంభించినట్టు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. సోమవారం టీడీపీ దెందులూరు మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు), నాయకులు మోత్కురి శోభన్‌బాబు (నాని), పెరుగ్గూడెం మాజీ సర్పంచ్ యలమర్తి హేమలతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెరుగ్గూడెం కమ్యూనిటీ హాలులో అధికారులు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. తొలుత పెరుగ్గూడెం మాజీ సర్పంచ్ యలమర్తి హేమలతా శ్రీనివాస్ గ్రామంలో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం వివిధ శాఖలపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. గోవిందపురం, చల్లచింతలపూడి, కొత్తకొంగువారిగూడెంలో ఎమ్మెల్యే పర్యటించి సమస్యలపై వినతులు స్వీకరించి అధికారులకు సిఫార్సు చేశారు. నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు వీఎస్‌రామ్ ప్రసాద్, చల్లచింతలపూడి మాజీ సర్పంచ్ ముమ్మడి మోహనరావు పాల్గొన్నారు.



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

## మురుగు డ్రెయిన్ సమస్య పరిష్కారానికి కృషి

**ఉంగుటూరు:** బాదంపూడి క్వారీ మురుగు కాల్వ సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని రైతులకు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు హామీ ఇచ్చారు. సోమవారం బాదంపూడి నుంచి నాచుగుంట రేవు వరకు మురుగు డ్రెయిన్‌లో వర్షం నీరు కిందికి ప్రవహించకపోవడంతో ముంపునకుగురైన పంట పొలాలను ధర్మరాజు పరిశీలించారు. ఈసమస్య పరిష్కారం కోసం ఉన్నతాధికారులతో చర్చిస్తానని ఆయన రైతులకుతెలిపారు. టీడీపీ నాయకులు పాతూరి విజయకుమార్, ఇమ్మని గంగధరరావు, జనసేన మండల అధ్యక్షుడు రాంబాబు, రైతులు పాల్గొన్నారు.



వర్షాలకు మునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

## క్రీడాసామగ్రి బహూకరణ



క్రీడా సామగ్రిని అందజేస్తున్న వెలమాటి చంద్రశేఖర్ జనార్ధనరావు

**దెందులూరు:** కొవ్వలి ఉన్నత పాఠశాలకు క్రీడా సామగ్రిని అందజేసిన దాత వెలమాటి చంద్రశేఖర్ జనార్ధనరావును హెచ్ఎం ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ, గ్రామ పెద్దలు గుత్తా రాజా, కసుకుర్తి రామకృష్ణ, చిట్టి బాబు అభినందించారు. కొవ్వలి ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన దాత చంద్రశేఖర్ జనార్ధన రావు రూ.1.5 లక్షల విలువైన క్రీడా సామగ్రిని పాఠశాలలో హెచ్ఎంకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తం

**పెదవేగి :** ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జే.గోవిందరావు సూచించారు. సోమవారం పెదవేగి మండలం వెంకటకృష్ణాపురంలో పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ మాధవి సూచనల మేరకు ఆరోగ్య సిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వే, దోమలు లార్వా పెరిగే స్థలాలను గుర్తించి వాటిని నాశనం చేయడం కార్యక్రమం నిర్వహించారు. వర్షాకాలంలో వ్యాపించే డెంగీ, మలేరియా, టైఫాయిడ్, నీళ్ల విరేచనాలు, కామెర్లు తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వ్యాప్తికి కారణమైన దోమలు మంచినీటి నిలువ ప్రాంతాలైన నీళ్ల తొట్టెలు, నీళ్ల కుండీలు, డ్రమ్ములు, వాడేసిన కొబ్బరి బొండాలు టైర్లు, పూలకుండీలు, రుబ్బు రోలు, ఎయిర్ కూలర్లు, ఫ్రిజ్ వెనుక బాక్సు తదితర ప్రాంతాల్లో పెరుగుతాయన్నారు. వారానికి ఒకసారి ఫ్రైడే-డ్రై డే ఆచరించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత లోపం వల్ల టైఫాయిడ్, కామెర్లు సంక్రమిస్తాయన్నారు. భోజనానికి ముందు చేతులు పరిశుభ్రపరచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, అనారోగ్య సమస్యను గుర్తించి అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. పెదవేగి, గోపన్నపాలెంలోని ఆరోగ్య కేంద్రాల్లో అన్ని వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ డి.రోజ్ మేరీ , హెల్త్ సూపర్‌వైజర్ రమేష్, హెల్త్ అసిస్టెంట్లు మేక శ్రీనివాసరావు, రమేష్ బాబు, ప్రసాద్, విజయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను అందజేస్తున్న అధికారులు

## దళితులపై దాడులను అరికట్టాలి



గణపవరంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ సభ్యులు

**గణపవరం:** రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై దాడులకు పాల్పడుతున్న దోషులను కఠినంగా శిక్షించాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని గణపవరం మండల కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేవీపీఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. కడప జిల్లా ఒంటిమిట్టలో దళితుడైన ప్రభాకర్‌పై కొందరు కుల దురహంకారులు వేడి నూనె పోయడం, కర్నూలు జిల్లా ఆధోనిలో దళిత మహిళ గుండమ్మను ట్రాక్టర్‌తో తొక్కించి చంపడం, భీమవరం మండలం వెంప గ్రామంలో మారణాయుధాలతో దళితులపై దాడులు చేయడం తదితర సంఘటనలు మానవత్వానికే మాయని మచ్చలని వారన్నారు. కుల దురహంకారంతో దాడులు చేస్తున్నా కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కేవీపీఎస్ కార్యదర్శి చిన్నం చిననాగేశ్వరరావు, నాయకులు చిన్నం వంశీ, కర్తాకి శేఖర్, కట్టూరి ప్రసాద్, ఎరిచర్ల కుమార్, మానుకొండభద్రి, మాదాసి చిన్ని తదితరులు పాల్గొన్నారు.

## మలకచర్ల- కంద్రిగ రోడ్డుకు మరమ్మతులు

**దెందులూరు:** కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు చేరి వాహనదారులు, వరి పొలాలకు వెళ్లే రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే చింతమనేని ఆదేశాలతో రోడ్లపై గుంతలను పూడ్చే పనులు ప్రారంభినట్టు టీడీపీ సీనియర్ నేత కమ్మ సుబ్బారావు, గౌడ సంఘం జిల్లా నాయకులు బాలిన కామయ్య అన్నారు. రామారావుగూడెం పంచాయతీ పరిధిలోని మలకచర్ల నుంచి కంద్రిగ, గండివారిగూడెం, పొలాలకు వెళ్లే రహదారిపై గుంతలను పూడ్చినట్టు తెలిపారు.

## వైభవంగా జగన్నాథ రథయాత్ర



నగరంలో జగన్నాథుని రథయాత్ర

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో నగరంలో రెండోసారి జగన్నాథ రథయాత్ర సోమవారం వైభవంగా నిర్వహించారు. స్థానిక లునాని పార్కు వద్ద ఉన్న ఇస్కాన్ మందిరం వద్ద మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే బడేటి చంటి ఈ యాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి శనివారపు పేట కాజ్‌వే మీదుగా అశోక్ నగర్, పత్తేబాద రైతుబజారు, రామచంద్రరావు పేట మెయిన్ రోడ్డు, ఫైర్ స్టేషన్ సెంటర్, ఒన్‌టౌన్, మెయిన్ బజారు మీదుగా రామకోటి ప్రాంగణానికి యాత్ర చేరుకుంది. యాత్ర వందలాది మంది భక్తులు నృత్యాలు, కీర్తనలతో, గానాలతో, కోలాట ప్రదర్శనలతో నగర వీధుల్లో ఆనందోత్సాహాల మధ్య సాగింది. సాయంత్రం 6.30 గంటల నుంచి రామకోటి ప్రాంగణంలో స్వామి వారికి పుష్పాభిషేకం, చప్పన్ భోగ నైవేద్యం సమర్పించారు. అనంతరం జగన్నాథ ప్రవచనం, భక్తులందరికీ జగన్నాథ ప్రసాద విందు పంపిణీ చేశారు.

## సామర్థ్యాలను నైపుణ్యాలుగా మార్చుకోవాలి



విద్యార్థిని ఏకపాత్రాభినయం

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** పుట్టుకతో మనలో ఉండే సామర్థ్యాలను అవకాశం వచ్చినప్పుడు నైపుణ్యాలుగా మార్చుకోవాలని సెయింట్ థెరిస్సా కళాశాల పీజీ డైరెక్టర్ సిస్టర్ సుశీల పిలుపునిచ్చారు. ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవాన్ని సోమవారం కళాశాలలో నిర్వహించారు. యువతలోని నైపుణ్యాలను వెలికితీయడానికి విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆమె చెప్పారు. యువతకు ఉపాధి, నైపుణ్యాలను సమకూర్చుకోవడం, సమాజంలో సవాళ్లను ఎదుర్కొనే విధంగా తయారు చేయడమే ఈ పోటీల ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నృత్యం, సంగీతం, హాస్య వల్లరి, కవితా రచన, మెహందీ, కేశాలంకరణ, ఏకపాత్రాభినయం అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకురాలు కళ్యాణి, కామర్స్ విభాగాధిపతి సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు జగదీశ్వరి, హారిక, లావణ్య పాల్గొన్నారు.